విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 06 మే 2025 8 పేజీలు



ఏలూరులో

భీమవరంలో

కాకినాడలో

ప్రపంచ ఉద్యమ మార్గదర్శి కార్ల్‌మార్క్స్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రపంచ ఉద్యమ మార్గదర్శి కార్ల్‌మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక రచయిత, కార్మిక వర్గ పోరాటాల పితామహుడు, పెట్టుబడి గ్రంధ రచయిత కార్ల్ మార్క్స్ 207 వ జయంతి కార్యక్రమం సోమవారం ఆర్.ఆర్.పేట, స్ఫూర్తి భవన్‌లో ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డేగా ప్రభాకర్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచంలో దోపిడీ లేని అందరికీ సమాన అవకాశాలు కలిగి ఉండే సమాజం కోసం అనునిత్యం తపించి అటువంటి సమాజ నిర్మాణం కోసం తన సహచరుడు ఫ్రెడరిక్ ఏంగెల్స్ సహకారంతో కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను రచించి ప్రపంచ పెట్టుబడి దారుల వెన్నులో వణుకు పుట్టించిన గొప్ప నాయకుడు కార్ల్‌మార్క్స్ అన్నారు. పెట్టుబడి గ్రంథం రచించడం ద్వారా కార్మికుల శ్రమను పెట్టుబడిదారీ వర్గం ఏ విధంగా దోచుకుంటుందో ప్రపంచానికి తెలియజేయ డం ద్వారా కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చిన మహోన్నత వ్యక్తి కార్ల్ మార్క్స్ అని కొనియాడారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రపంచ కార్మికులకు శ్రమ శక్తిని తెలియజేసి వారి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చిన గొప్ప వ్యక్తి కార్ల్ మార్క్స్ అన్నారు. కార్మిక వర్గ పునాదిపై ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని సంకల్పించిన కార్ల్ మార్క్స్ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను రూపొందించారని తద్వారా అసమానతలు లేని దోపిడీ లేని సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని తెలిపారు. నేడు ప్రపంచం లోని కార్మికులందరూ తమ సమస్యల పరిష్కారం కోసం కార్ల్ మార్క్స్ చూపిన మార్గంలో పయనించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ,ఉప్పులూరి లక్ష్మీ, భవాని, గొర్లి స్వాతి, యర్రా వెంకటేశ్వర రావు,మందా క్రాంతి కుమార్, పాతూరి ▶మిగతా 2లో..

రెండేళ్లలో పోలవరం పూర్తి

ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర-పోలవరం: రానున్న రెండేళ్లలో ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీని వాసులుతో కలిసి సోమవారం ఎంపీ మహేష్‌కుమార్ పోల వరం ప్రాజెక్టును సందర్శిం చారు. అనంతరం ప్రాజెక్ట్ సమావేశ మందిరంలో పోలవరం పనుల పురోగతిపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా పనుల పురోగతి పెరగాలని, ఇకపై ప్రతి నెల పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తానని ఎంపీ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్‌కుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. నిర్వాసితులకు రూ. వెయ్యి కోట్లు పరిహారం మంజూరు చేసిందని ఎంపీ తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.157 కోట్లు పెండింగ్ ఉందని, భూ సమీకరణకు సంబంధించి రూ.219 కోట్లు చెల్లించాల్సి ఉందని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం కోండ్రుకోటలోని పోలవరం నిర్వాసితులకు సంబంధించిన ఎల్. ఎన్. డి కాలనీని సందర్శించిన ఎంపీ మహేష్ కుమార్ వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవి రమణ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి. శ్రీనివాసులు రెడ్డి,ఐటీడీఏ పీవో కే.రాములు, హౌసింగ్ ఈఈ జి.సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఈఈ కె.శ్రీను, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ టి.లత, ఈడబ్ల్యు డిప్యూటీ ఈఈ ఎ.కోటీశ్వరరావు,ఆర్.అండ్.బి డిప్యూటీ ఈఈ సిహెచ్ హరికృష్ణ, ఆర్.అండ్.బి ఈఈ వైవి కిషోర్ బాబ్జి,తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి

ఏఐటీయూసీ డిమాండ్

ఏలూరులో

తాడేపల్లిగూడెంలో

విశాలాంధ్ర-ఏలూరు: కార్మికులకు కనీస వేతన సలహా బోర్డును వెంటనే నియమించాలని,కనీస వేతనం నెలకు రూ. 35వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, ఏఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు డిమాండ్ చేశారు.సోమవారం ఎఐటియుసి దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ గత నవంబర్ నెలలో బెంగళూరులో కార్మిక సంఘాలతో కనీస వేతనాలపై ఆల్ ఇండియా వర్క్ షాప్ నిర్వహించినట్టు తెలిపారు. డాక్టర్ ఆక్రాయిడ్ కమిషన్ సిఫార్సులు ప్రకారం ఈరోజు ధరలకు అనుగుణంగా నెలకు రూ. 35వేల జీతం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తదనంతరం గోవాలో జరిగిన ఏఐటియుసి జాతీయ కార్యవర్గంలో కనీస వేతనం రూ. 35వేలు కనీస వేతనం కోసం దేశవ్యాప్తంగా ధర్నాలు చేయాలని ఏఐటియుసి పిలుపునిచ్చింద న్నారు. కార్మిక శాఖ ఎన్ఫోర్స్మెంట్స్ యంత్రాంగాన్ని పటిష్టం చేసి కనీస వేతన చట్టాల అమలుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా ఉద్దేశించి ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు, ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులు కే.కృష్ణమాచార్యులు, ▶మిగతా 2లో..

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర - కాకినాడ : అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర విని యోగదారుల వ్యవహా రాలు, ఆహార, పౌరసర ఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మిల్లర్లు, అధికారులను కోరారు. సోమవారం

కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ, బిఆర్ అంబేత్కర్-కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి రైతుల నుండి రబీ ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలపై ▶మిగతా 4 లో..

పిజిఆర్ఎస్‌లో 176 అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం ఉండరాదని, అర్జీ దారులు సంతృప్తి చెందేలా వాటి పరిష్కార విధానం ఉండాలని, నిర్లక్ష్య వైఖరి ఉపేక్షించవద్దని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) మీ కోసం లో సంయుక్త కలెక్టర్ ఎస్. చిన్నరాముడు తో కలిసి అర్జీలు

స్వీకరించారు .అనంతరం కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ తమ సమస్య పరిష్కారం కాలేదంటూ ప్రజలు తన వద్దకు మళ్ళీ మళ్ళీ వస్తే అది సంబంధిత అధికారి నిర్లక్ష్యంగా పరిగణిస్తా నన్నారు. పీజీఆర్ఎస్ కొందరు అధికారులు గైర్హాజరు కావడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ 96 , పీఆర్ 18 , పోలీసు 16 , విద్యుత్ 11, ఇతర శాఖలకు చెందిన 35 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, డీఎస్పీ భవ్య కిశోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి (జేడి) ఎల్. అప్పలకొండ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆల్ ఆంధ్ర టాటా మ్యాజిక్ ఫ్రెండ్స్ గ్రూపు ద్వారా శ్రీకాకుళానికి చెందిన బబ్జి అనే టాటా మ్యాజిక్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, అతని కుటుంబ సభ్యులకు ఆల్ ఆంధ్ర టాటా మ్యాజిక్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులంతా కలిసి శ్రీకాకుళం ఆర్డీవో పివి గంగాధర్ రావు చేతుల మీదగా 1,16,118 రూపాయలను అందజేసినట్టు కొయ్యలగూడెంకు చెందిన ఆల్ ఆంధ్ర టాటా మ్యాజిక్ ఫ్రెండ్స్ గ్రూప్ అడ్మిన్ సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆపదలో ఉన్న ఆల్ ఆంధ్ర టాటా మ్యాజిక్ గ్రూప్ సభ్యులందరికీ సహాయ సహకారాలు అందజేయడానికి టాటా మ్యాజిక్ డ్రైవర్లంతా సమిష్టిగా సహకరిస్తామని ఆయన పేర్కొన్నారు. గ్రూపు పెట్టిన తర్వాత ఇప్పటివరకు అనేక మందికి సహాయ సహకారాలు అందజేసి నట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో టి. తిరుపతిరావు, శ్రీకాకుళం సురేష్, అనకాపల్లి వరప్రసాద్, పెద్దాపురం సురేష్, రాజం కిరణ్, పార్వతీపురం బాలకృష్ణ, కొర్లం జంక్షన్ పండ, మానపురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేధావులను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఎందరో మేధావుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులు పసుమర్తి సూర్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ముదినేపల్లి గ్రేడ్ 3 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబి రాలు 7వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థు లకు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జీవితం, బాల్యం నుంచి చివరి వరకు ప్రధానిగా దేశానికి అందించిన విశిష్ట సేవలు వివరిం చారు.గ్రంథాలయ అధికారిణి యం శ్రీదేవి , పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటుధర కల్పించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని పోలవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం గ్రామ శివారులో ఉన్న వర్జీనియా పొగాకు బోర్డులో ఆక్షన్‌కు వచ్చిన పొగాకు బేళ్లను బాల రాజు రైతులతో కలిసి పరిశీలించారు. ఆక్షన్ సూపరింటెండెంట్ గ్రేసీ మార్గరెట్‌ను ప్రస్తుతం పొగాకు ధర ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గతంలో అధికారంలో ఉన్నప్పుడు రైతులు పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర 400 రూపాయల వరకు ఇప్పించిందన్నారు. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్న, సన్న కారు రైతులు పొగాకు పంటకు కనీస గిట్టుబాటు ధర లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మలపల్లి గంగరాజు, గంటా రమేష్, గంట శ్రీనివాసరావు, పోలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏలేటి చంద్రరావు, రైతు నాయకులు కాకర్ల నందియా, రైతులు, వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ జవాబుదారితనమేది ?

విశాలాంధ్ర - ముదినేపల్లి : రైతు వ్యవసాయక్షేత్రం కార్యాలయ ఉనికిని కోల్పోతుంది. రైతులు వచ్చినా, ఇతర పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చినా కార్యాలయం ఎక్కడికైనా మార్చారా అంటూ పరిసరాల్లో అడుగుతూ ఉంటారు. ముదినే పల్లి మండల పరిషత్ ప్రాంగ ణంలో ఉండే మండల వ్యవసాయ కార్యాలయం దీనస్థితిలో ఉంది. ఇక్కడ సిబ్బంది ఎవరో రైతన్నలకే ప్రశ్నార్థకంగా మారింది. లోనికి వెళ్లే ప్రదేశం పరిసరాలు చెత్తాచెదారాలతో నిండింది. బిల్డింగ్ పైన అధికారి ఛాంబర్, కింద స్టోరేజీ సిబ్బంది ఉంటారు. ఎప్పుడొచ్చినా జవాబు చెప్పేవారు లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ పరిసరాలు చెత్తాచెదారాలు తుప్పలు అస్తవ్యస్తంగా పడి ఉండడంతో అల్లంత దూరాన చూసి ఇంటి ముఖం పడుతున్నామని రైతులు వాపోతున్నారు. కార్యాలయ పరిసరాలు తక్షణం శుభ్రపరిచి వచ్చే రైతులకు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు.

కార్ల్‌మార్క్స్ (1వ పేజీ తరువాయి)

(1వ పేజీ తరువాయి)

నాగేశ్వరరావు, షరీఫ్,తదితరులు పాల్గొన్నారు.

భీమవరం: శ్రమజీవుల రాజ్యస్థాపనకు బాటలు వేసిన గొప్ప దార్శనికుడు కారల్ మార్క్స్ అని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతవేత్త కారల్ మార్క్స్ 207 వ జయంతి సందర్భంగా సోమవారం భీమవరం సీపీఐ జిల్లా కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ సమాజంలో ఆకలి, దారిద్ర్యం, దోపిడీ, ఆర్థిక అసమానతలు లేని సమసమాజ స్థాపన లక్ష్యంగా కమ్యూనిస్టు తత్వవేత్త ఎంగెల్స్ తో కలిసి కారల్ మార్క్స్ దాస్ కాపిటల్, కమ్యూనిస్టు ప్రణాళిక లాంటి ఎన్నో గ్రంథాలను రచించి ప్రపంచానికి అందించారన్నారు.మార్క్స్, ఎంగెల్స్ అందిం చిన కమ్యూనిస్టు సిద్ధాంతాలు అమలు ఫలితంగా ప్రపంచంలో అనేక దేశాల్లో శ్రమజీవుల రాజ్యాలు, సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్, నాగిడి శాంతమూర్తి, ప్రజానాట్యమండలి నాయకుడు ఖాన్‌భాషా, గుడిమెట్ల నరశింహమూర్తి మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడ : కాకినాడ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ సెల్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, నగర కార్యదర్శి అన్నవరం, శ్రీనివాస్, సూరిబాబు తదితరుల ఆధ్వర్యంలో డిఆర్‌ఓకి వినతి పత్రం అందజేశారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ కనీస వేతనాలు 35 వేల రూపాయలు మంజూరు చేయాలని, కనీస వేతన బోర్డును తక్షణమే నియమించాలని అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా విద్య, వైద్యశాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో పెరుగుతున్న అవసరాలు, ఇంటి అద్దెలు తదితర అవసరాలకు అనుగుణంగా ఒక కుటుంబం గౌరవప్రదంగా జీవించాలంటే నెలకు కనీసం 35 వేల రూపాయలు అవసరమని ఏఐటియుసి జాతీయస్థాయి వర్క్ షాప్ నిర్ధారించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో 12 మాసాలకు పైగా వేతనాలు చెల్లింపులు బకాయిలు పెట్టారని, వేతన బకాయిలన్నిటిని తక్షణమే చెల్లించాలని, కార్మికుల జీతాలను ప్రతినెలా ఒకటో తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సతీష్, శేఖర్, శ్రీనివాస్, నాని, కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: దోపిడీ లేని సమాజమే కార్ల్ మార్క్స్ ఆశయం అని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పేర్కొన్నారు. కార్ల్ మార్క్స్ 207 వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీవీఎస్ రాజు మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్ తన సహచరుడు ఏంగిల్స్ తో కలిసి కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక రచించి, పెట్టుబడిదారుల వెన్నులో వణుకు పుట్టించారని కొనియాడారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులు ఏ విధంగా దోచుకుంటారో ప్రపంచానికి తెలియజేయడం ద్వారా కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేసే విధంగా అవగాహన కల్పించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

ఇరగవరం: కమ్యూనిస్టు ఉద్యమ పితామహులు, పీడిత తాడిత ప్రజల విముక్తి ప్రదాత, తత్వవేత్త కార్ల్ మార్క్స్ 207వ వర్ధంతిని మండలంలోని

తూర్పు విప్పర్రు గ్రామంలోని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.కార్ల్ మార్క్స్ చిత్రపటానికి మండల కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అడ్డాల సత్యనారాయణ,గిద్ద సూర్యనారాయణ,చుక్కల బ్రహ్మయ్య, గాలికి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరాలను అరికట్టేందుకు ప్రజలు ఐక్యతగా ఉండాలి

విశాలాంధ్ర-లింగపాలెం: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహనతో ఉండాలని చింతలపూడి సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. నేరాలను అరికట్టడంపై ధర్మాజీగూడెంలో ప్రజలకు అవగాహన నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకన్నబాబు, ఏఎస్ఐ రాంబాబు, పోలీసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టడంలో ప్రజలు అవగాహనతో ఉండాలని అన్నారు. బాలికలను, మహిళలను గౌరవంగా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరిం చారు. ప్రజలు కలిసి ఉంటే నేరాలను పూర్తిగా నిరోధించవచ్చని తెలిపారు. సైబర్ నేరాలకు పాల్పడేవారు మోసపూరితంగా వ్యవహరిస్తా రని ఇటువంటి వారి ప్రలోభాలను నమ్మవద్దని తెలిపారు.గ్రామాలలో నివసించే ప్రజలంతా ఐక్యతగా ఉండాలని కోరారు.

ఈ -శ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - నరసాపురం: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ ఈ - శ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కార్డును కలిగివుండాలని ప్యానెల్ న్యాయవాదులు డి.నరసింహారాజు, డి. చాముండేశ్వరి అన్నారు. నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ అసంఘటిత రంగంలోని కార్మికులకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం సరిపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద పనిచేస్తున్న రోజువారీ కూలీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రమాద వశాత్తూ అనుకోని సంఘటనలు జరిగినపుడు నష్ట పరిహారం పొందడానికి ఈ - శ్రమ్ కార్డు ఉపయోగపడుతుందన్నారు. 14సంవత్సరాలలోపు పిల్లలచేత ఎటువంటి కూలి పనిచేయించకూడ దన్నారు. బాలల చేత పని చేయిస్తే అటు తల్లిదండ్రులకు, ఇటు యజమానికి కార్మిక చట్టం ద్వారా జరిమాన, జైలు శిక్ష విధించవచ్చు న్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎం. వెంకట లక్ష్మీ పతి, పి.ఎల్.వి ఎం. ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

కనీసవేతనం (1వ పేజీ తరువాయి)

(1వ పేజీ తరువాయి)

జిల్లా నాయకులు పి. కిషోర్ మాట్లాడుతూ అనేక రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో 12 నెలల నుండి బకాయిలు ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతినెల 1వ తేదీన జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏఐటియుసి ఏరియా కార్యదర్శి ఎ. అప్పలరాజు, జిల్లా నాయకులు డి.లక్ష్మణమూర్తి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యదర్శి కే. విగ్నేష్ ,భజంత్రీ శ్రీనివాస్, వి.దత్తాత్రేయ, కె.వసంతరావు, ఏరియా నాయకులు కడుపు కన్నయ్య,బి జగన్నాధరావు, పి.విజయ, వినోద్, సరిది సురేష్ కుమార్, జి.ఈశ్వరరావు ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: కార్మికులకు, ఉద్యోగులకు కనీసవేతనం రూ.35వేలుగా నిర్ణయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. కనీస వేతనాల పెంపుదల డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ జాతీయస్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయం వద్ద , ఏరియా ఆసుపత్రి వద్ద సోమవారం కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. కనీస వేతనాలను పెంచాలని, కొత్త పీఆర్సీ ప్రకటించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సంఖ్యను పెంచాలని కార్మికులను పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ మాట్లాడుతూ దేశంలో మారిన జీవన స్థితిగతులను, పెరిగిన జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసవేతనాన్ని 35 వేల రూపాయలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సంపద సృష్టిలో, సేవలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్న కార్మికులకు సమాజంలో మర్యాద, మన్నన పెరగాలని, వారికి గౌరవప్రదమైన వేతనాలు ఇవ్వాలని ఏఐటియూసీ కోరుతుందని డి. సోమసుందర్ వివరించారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ సెంట్రల్ పే కమిషన్‌ను వెంటనే నియమించాలని, రాష్ట్రంలో కొత్త పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ కార్యదర్శి మండపర్తి హరీష్ మాట్లాడుతూ కేంద్ర పే కమిషన్ నియమించి పదేళ్లు దాటిందని వెంటనే కొత్త పే కమిషన్ నియమించి, కనీస వేతనం రూ.35వేలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు జరగడం లేదని అన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లడుతూ పదేళ్ల క్రితం కనీసవేతనం రూ. 26వేలు ఇవ్వాలని ఏఐటియుసి డిమాండ్ చేయగా ప్రభుత్వం తొలుత 12 వేలు ఇచ్చిందని, దఫ దఫాలుగా సమ్మెలు చేయగా 2019 నాటికి వేతనాన్ని పదహారు వేలకు పెంచిందని, ఆ తర్వాత పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ అలవెన్స్ ప్రకటించినా అందులో కొన్ని విభాగాలకు మాత్రమే ఇచ్చారని అన్నారు. కార్యక్ర మానికి ఏఐటీయూసీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొడమంచిలి చంద్రరావు, ఎం.కాటమ రాజు, ఉప్పాటి నాగరాజు, ముత్యాల జగదీష్ , ఏడిద నాని, కళింగ శ్రీను, బి.శివశంకర్, రామాంజ నేయులు, ధనాల రవి, రౌతు రాజేష్, అల్లం వీర వెంకట లక్ష్మి, తాడికొండ కనక మహాలక్ష్మి, మండేల్లి జయసుధ, పెనుమాక విజయ, సావిత్రి, కళింగపట్నం శ్రీనివాస్, పెద్దిరాజు, లక్కవరపు శ్రీనివాస్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జీ.సురేష్, కుమారి, పార్వతీ, రాంబాబు, నాగేంద్ర, తదితరులు నాయకత్వం వహించారు.

భీమవరం: కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ దేశంలో వున్న ధరలకనుగుణంగా నెలకు 35 వేల రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని, డాక్టర్ ఆక్రాయిడ్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం నెలకు 35 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం

నాయకులు భీమవరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. చిన్న కుటుంబం గడవా లంటే కనీసంలో కనీసం నెలకు 35 వేల రూపాయలు పైబడిన మాటని ఇదే విషయం డాక్టర్ ఆక్రాయిడ్ కమిటీ అధ్యయనం చేసి ఆప్రకారం కనీస వేతనం ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేసిందని కోనాల గుర్తు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు ఎం.సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

విశాలాంధ్ర-లింగపాలెం: ఒక్కసారిగా వచ్చిన అకాలవర్షం లింగపాలెం మండలంలోని దాళ్వా రైతులపై ప్రభావం చూపింది. ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసింది. వర్షంవల్ల వరి కోతలు నిలిపివేశారు. ధాన్యం కొనుగోళ్లు ఆగిపోయాయి. ధర్మాజీగూడెం మార్కెట్ యార్డులో ఆరబెట్టిన వందలాది క్వింటాళ్ల ధాన్యం తడిసిపోవడంతో

రైతులు దిగులు చెందుతున్నారు. ధాన్యాన్ని పూర్తిగా భద్రపరుచుకునే అవకాశం లేకుండా వర్షం వచ్చింది. దాళ్వా పంట ఆశాజనకంగా ఉందనుకున్న సమయంలో అకాల వర్షం రైతులలో దిగులు కలిగించింది. తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు సమయం పడుతుందని రైతులు అంటున్నారు. ధాన్యం ఆరకపోతే కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. లింగపాలెం మండలంలో ఇప్పటికీ 1200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వర్షం పడకపోతే ఒక్కరోజులో మూడు వందల టన్నుల ధాన్యాన్ని ఎగుమతి చేసేవారు. వర్షం వల్ల కొన్ని లారీలలో ఎక్కించిన ధాన్యాన్ని దించేయాల్సిన పరిస్థితి నెలకొంది. తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ ప్రసాద్, మండల్ వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ ధర్మాజీగూడెం,టి.సి. హెచ్.ఆర్.పాలెం, లింగపాలెంలో పర్యటించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అకాల వర్షం వల్ల ధాన్యం పెద్దగా తడవలేదని అధికారులు తెలిపారు. తడిసిన ధాన్యం వల్ల కొనుగోలుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అన్నారు. వర్షం రావడం, వాతావరణంలో పరిస్థితులు మారడంతో కోతలను నిలిపివేశారు.అకాల వర్షం వల్ల రబీలో వరి పంట వేసిన రైతులు అకాల వర్షంతో కొంతమేర నిరాశ చెందుతున్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలంటే ప్రతిరోజు యోగ, శారీరక వ్యాయామాలు చేయాలని గ్రంథ పాలకురాలు యు. రాముడు విద్యార్థులకు తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులకు యోగ ఆసనాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థు లతో కథల పుస్తకాలు చదివించి, చూడకుండా కథలు రాయించడం, అభినయ గీతాలను

పాడించారు. ప్రతిరోజు గ్రంథాలయాలకు రావడం వలన తమ మేథోశక్తి పెరుగుతుందని, ఆరోగ్య పరిరక్షణ కోసం శారీరక వ్యాయామాలు, యోగాలు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వడ గాల్పుల నుండి రైతులు పశువులను సంరక్షించుకోవాలి

విశాలాంధ్ర - పాలకోడేరు : ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదై విపరీతమైన వడ గాల్పులు ఉన్నందున రైతులు పశువుల పట్ల తగిన శ్రద్ధ చూపించాలని మండల పశువైద్యాధికారి టి.హేమ అన్నారు. ముఖ్యంగా పశువుల శరీరంలోని నీరు ఆవిరి రూపంలో బయటికి వెళ్లిపోవడం వల్ల పశువులు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని, పాడి పశువులు అధిక తాపానికి గురైతే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది అన్నారు. వడ గాల్పుల వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉన్నదన్నారు. ముఖ్యంగా చెమట ద్వారా శరీరంలోని అధిక వేడిని విసర్జించే అవకాశాలు పాడి

పశువులకు చాలా తక్కువ అన్నారు. గేదెలలో నల్లని చర్మం ద్వారా వాతావరణంలోని వేడి శరీరంలోకి ఎక్కువగా ప్రవేశించి తాపాన్ని పెంచుతుందన్నారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం, గాలి ప్రసరణ ఎక్కువగా లేకపోవడం షెడ్లలో ఎక్కువ పశువులు ఉండడంవల్ల ఉక్క బోత, నీటి సౌకర్యం తక్కువగా ఉండడం వల్ల వడదెబ్బకు గురవుతాయి అన్నారు. అలాంటి పరిస్థితుల్లో నడుస్తూ తూలిపోతూ పడిపోతుంటాయని, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతూ రొప్పుతుంటాయని,అలాంటప్పుడు పశువులను చల్లటి ప్రదేశం లోని తీసుకువెళ్లి శరీర ఉష్ణోగ్రతను తగ్గించుటకు నీటితో తడపాలని పేర్కొన్నారు. గొర్రెల పెంపకం దారులు తమను తమ జీవాలను ఎండ బారి నుండి రక్షించుకొనుటకు వేకువ జామున మరియు సాయంకాలం మాత్రమే మేత కోసం తిప్పాలన్నారు. లేయర్,బాయిలర్ కోళ్ల ను పెంచే రైతులు రేకు షెడ్ల పై గడ్డిని పరచి స్ప్రింక్లర్ ద్వారా నీటిని చల్లడం వల్ల కోళ్ల ను అధిక వేడి నుంచి రక్షించవచ్చన్నారు.

నాగభూషణం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర-కామవరపుకోట: చలనచిత్ర నటుడు నాగభూషణం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఏపీ ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా సభ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు అన్నారు. సోమవారం నాగభూషణం వర్ధంతి కార్యక్రమం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీవీఎస్ రాజు మాట్లాడుతూ కళకళకోసం కాదు కళ ప్రజల కోసం అని, ప్రజా సమస్యల్ని ఇతివృత్తంగా తీసుకొని నాటకాలు ప్రదర్శించి అందులో ముఖ్యమైన రక్త కన్నీరు నాటకాన్ని 5వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన నటుడు సి. నాగభూషణం అన్నారు. నాగభూష ణం విద్యార్థి దశలోనే కళలపై ఆసక్తితో రంగస్థల కళాకారునిగా శ్రీకారం చుట్టి నాటకాలు ప్రదర్శిస్తూనే చలనచిత్ర రంగంలోకి ప్రవేశించి వందల చిత్రాల్లో ప్రతి నాయకునిగా పలు చిత్రాల్లో నటించారన్నారు. నాగభూషణం

ప్రజానాట్య మండలి అధ్యక్షునిగా అన్న నల్లూరి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల్లో పర్యటించి సామాజిక చైతన్యంతో కూడా ఎన్నో కళారూపాలను రూపొందించి కళాకారులు అందర్నీ కళా కుటుంబంగా తీర్చిదిద్దిన వారి ఆలోచనలను ఆశయాలను మనమంతా పూర్తిగా తీసుకోవాలని కళాకారులను కోరారు

వినోదాత్మకంగా వేసవి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - ఏలూరు: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణతరగతులు సమ్మర్‌క్యాంప్ "7వ రోజు ఎంతో వినోదాత్మకంగా నిర్వహించ బడుతున్నాయని, సోమవారం శిక్షణ తరగతులను పర్యవేక్షించి నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎమ్.శేఖర్ బాబు తెలిపారు. అనంతరం గ్రంథా లయ సిబ్బంది బివిఎస్.లక్ష్మి విద్యార్థులకు ఓంకారం నినాదంతో యోగాక్లాసులు నిర్వహించారు. తొలుత రిసోర్స్‌పర్సన్ పి.సంతోషకుమారి విద్యార్థులకు నేటి సమాజంలో విద్యార్థులు "చెడ్డస్నేహం-చెడ్డ ఫలితాలు" బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, అవి దుష్ఫలితాలకు దారితీస్తాయన్నారు. రెండు నీతికథలను ("తోడేలు - కోతి")చిన్నపిట్ట- చిన్నప్రయ త్నం- పెద్దఫలితం నీతికథలను భోదించా రన్నారు. అనంతరం డి.శ్రీవల్లి రిసోర్స్ పర్సన్ విద్యార్థులకు స్వాతంత్ర్య సమర యోధులు, దేశనాయకుల జీవితచరిత్రలు వివరించారు. రిసోర్స్ పర్సన్ పి.శంకర్

డ్రాయింగ్ టీచర్, విద్యార్థులకు రకరకాల చిత్రలేఖనం పై శిక్షణ అందిస్తున్నారు. అనంతరం ప్రముఖనృత్య కళాకారులు వై.ఫణికాంత్, విద్యార్థులకు నృత్యాలపై శిక్షణలను ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్ కుమార్, ఎం.డి.అస్లాంపాషా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనం ప్రారంభం

విశాలాంధ్ర - ఏలూరు: బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనాన్ని కలెక్టర్ కె. వెట్రిసెల్వి జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం ఆవరణలో జిల్లా వైద్య విధాన పరిషత్ సమన్వయ అధికారి డాక్టర్ పాల్ సతీష్ కుమార్, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని

లతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్రీయ బాల సురక్షా కార్యక్రమంలో భాగంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక మంచి కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగు పడటమే కాకుండా, బాలల ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడానికి కూడా ఇది సహాయపడుతుందన్నారు. జిల్లాలో పుట్టుక లోపములు గల పిల్లలను ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్ళి అక్కడ చికిత్స అందించి మరల తిరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దించే ఈవాహనాలను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా. రాజీవ్, ఐసీడీ ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద,ఆర్ బి ఎస్ కె జిల్లా ప్రోగ్రాం అధికారి కే నరేంద్ర కృష్ణ, జిల్లా మేనేజర్ బొప్పన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణకు చాలా చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని 1వ అదనపు సివిల్ జడ్జి పి.హనీష అన్నారు. అసంఘ టిత కార్మికులకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా భీమవరంలో

సోమవారం అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు తమ హక్కులకు భంగం కలిగితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటా రన్నారు. కనీస వేతన చట్టం, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎన్.సుధీర్, పి.అంబేద్కర్, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వయస్సు వందేళ్లు... పనులన్నీ కుర్రాడిలానే

విశాలాంధ్ర-లింగపాలెం: వయసు వందేళ్లు... పనులన్నీ కుర్రాడిలానే చేస్తున్నాడు కలరాయన గూడెంకు చెందిన సికాకొల్లు సుబ్బయ్య. ఎటువంటి అనారోగ్యం లేకుండా యువకుడిలా పనులు చేసుకుంటున్నాడు. ఈ వృద్ధుని హుషారు చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా 14 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతుంటాడు. ఉదయాన్నే తనకు నచ్చిన రీతిలో ఆసనాలు వేస్తుంటాడు. పేదరికం, చదువుకోకపోవడం ఆరోగ్యా నికి అడ్డుకాదని అంటున్నాడు. పేదరికంలో పుట్టిన సుబ్బయ్య చిన్నప్పటినుంచి కష్టం చేసుకుని జీవిస్తూ వస్తున్నాడు. ఈయన భార్య పాపమ్మకు 85 ఏళ్ళ వయస్సు. ఈ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.పెద్ద కుమార్తెకు నలుగురు పిల్లలు వీరందరికి పెళ్లిళ్ళు అయ్యి ఇద్దరేసి చొప్పున బిడ్డలు ఉన్నారు. రెండో కుమార్తెకు ముగ్గురు సంతానం. వీరికి పెళ్లిళ్లు జరిగి ఇద్దరేసి చొప్పున పిల్లలు ఉన్నారు. మూడో కుమార్తెకు ఐదుగురు కుమార్తెలు జన్మించారు. వీరందరికీ వివాహమై



ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున పిల్లలు జన్మించారు. నాలుగో కుమార్తెకు ఇద్దరు పిల్లలు. వీరికి వివాహాలు అయ్యి ఇద్దరేసి చొప్పున పిల్లలు ఉన్నారు. ఈవృద్ధ దంపతులకు చివరిగా కొడుకు పుట్టాడు. ఇతనికి ఇద్దరు బిడ్డలు. వీరికి వివాహం జరగాల్సి ఉంది. సుబ్బయ్య దంపతులకు 48 మంది పిల్లలు వారసత్వంగా ఉన్నారు. ఈ వృద్ధ దంపతులిరువురు ఒకరిపై ఆధారపడకుండా సొంతంగా జీవనం సాగిస్తున్నారు. తాను ఆరోగ్యంగా ఉండటానికి ప్రత్యేక ఆహర నియమాలు ఏమీ లేవని అంటున్నాడు సుబ్బయ్య. చిన్నప్పటి నుంచి కష్టపడి పనిచేయటం అలవాటు ఉందని, వృద్ధాప్యంలో కష్టపడటమే తన ఆరోగ్యానికి కారణమని అంటున్నాడు.ఈ వయసులో కూడా 14 కిలోమీటర్లు రోజు సైకిల్ తొక్కడం వల్ల ఎటువంటి అలసట లేదని,ఉండదని అన్నాడు.తన కష్టంతో పాటు అదృష్టం కూడా తనకు తోడుగా ఉందని తెలిపాడు. చిన్నతనం నుంచి కల్లు తాగటం అలవాటని ఇప్పటికీ ప్రతిరోజు కల్లు తాగుతూనే ఉంటానని తెలిపాడు. ఉదయం మాత్రమే కల్లు తాగుతానని మళ్లీ రోజంతా ఎటువంటి మద్యాన్ని తీసుకోనని తెలిపాడు. ఆసనాలు వేయటం తాను సొంతగా నేర్చుకున్నానని ఇప్పటికీ కూడా ఆసనాలు వేస్తున్నానని అన్నాడు. తాను చదువుకోలేదని రాజకీయాలు, సమాజంలో జరిగే విషయాలు తనకి ఏమి తెలియవని, పట్టించుకోనని అన్నాడు.తనకు శక్తి ఉన్నంతవరకు కష్టపడుతూనే ఉంటానని తెలిపాడు.

మీకోసం అర్జీలు పరిష్కరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: మీకోసంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను

ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వ హించి అర్జీదారుల నుండి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి అర్జీని సమర్పించుకునేందుకు పూర్తి అంగవైకల్యం కలిగిన బిడ్డను ఎత్తుకొని వచ్చిన దంపతుల వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి పాప అంగవైకల్యంపై ఆరా తీశారు. దివ్యాంగుల పెన్షన్ వస్తుందా, ప్రతి నెల ఎంత పెన్షన్ వస్తుంది, ఇప్పుడు ఏ విషయమై మీరు అర్జీని సమర్పించడానికి ఇక్కడికి వచ్చారు అని ప్రశ్నించగా తమ బిడ్డ నూరు శాతం అంగవైకల్యంతో కదలలేని పరిస్థితుల్లో ఉన్నదని, దివ్యాం గుల పెన్షన్ రూ.6 వేలు ప్రస్తుతం వస్తున్నదని, వీల్ చైర్‌కు, మంచానికే పరితమైన వారికి అందజేసే రూ.15 వేలు పెన్షన్ మంజూరుకు సిఫారసు చేయవలసిందిగా కలెక్టర్ ను కోరారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అర్హతకు కావలసిన ధ్రువపత్రాలను, బిడ్డ వాస్తవ పరిస్థితులను పరిశీ లించి రూ.15 వేలు మంజూరుకు ఆన్లైన్లో పొందుపరచాలని డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి డా.కె.సి.హెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సమస్యలు పరిష్కరించి మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బంజారా భజరంగీ భేరీ సంఘ ప్రధాన కార్యదర్శి భుక్యా వేణుగోపాల్

నాయక్ ఎంపిడివో మణి కుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో చెత్త పోగులు, లీక్ అవుతున్న వాటర్ పైప్ లైన్లు, మురికి కాలువల సమస్యలతో గ్రామం అస్తవ్యస్తంగా ఉందన్నారు. గత సంవత్సర కాలం నుండి గ్రామంలోకి చెత్తను సేకరించే ఆటో రావడంలేదని, చెత్త పోగులు ఏర్పడి గ్రామమంతా దుర్వాసన వస్తున్నదని ఆయన తెలిపారు. రాబోయే వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నదని, చెత్త సేకరించే ఆటోను గ్రామానికి పంపించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమస్య లపై ఎంపీడీవో మణికుమారి సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో బంజారా భజరంగీ భేరీ కమిటీ సభ్యుడు ధరావత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దాసు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ప్రసాద్

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : దాసు సంక్షేమ సంఘం మండల నూతన అధ్యక్షులుగా పాముల ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘ సమావేశం జీలుగుమిల్లిలో పాముల ప్రసాద్ ఇంటి వద్ద పోలుకొండ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన

వరప్రసాద్ మాట్లాడుతూ తనను అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ నూతన కమిటీలో కార్యదర్శిగా జెట్టి రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా కోటపాటి రమేష్, ఉపాధ్యక్షు లుగా పోలుకొండ నరసింహారావు, కోశాధికారిగా బట్టు లక్ష్మి తో పాటు మరో పదహారు మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంక్షేమ సంఘం ఏర్పాటుకు సహకరించిన పల్లం రవికుమార్ జంగారెడ్డిగూడెం, నేలటూరి సత్యనారాయణ ద్వారకాతిరుమల, కారం నరేష్ అచ్చన్నపాలెం వారికి నూతన సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బీర రవి, గద్దం వీరబాబు, గెద్దం జనార్దన్, ఉర్ల బాబి, పోలుకొండ నాగు, గెద్దం పండు, బట్టు గోపి, కోరం చెన్నకేశవులు, భూషి మధు, చెటగోపం నరసింహ, దాస్యం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. శివ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. పాఠశాల, కళాశాల పేరుతో ముద్రించిన పుస్తకాలకు రూ.15 వేల నుండి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్ఐఓ స్పందించి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కానిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర-కాళ్ళ : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుం దని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణం రాజు అన్నారు. కాళ్ల మండలం దొడ్డనపూడిలో సుమారు రూ. 28 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను సర్పంచ్ కొల్లి సుబ్బారావుతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డనపూడి గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. నాబార్డు నిధులతో త్వరలోనే గ్రామంలోని మెయిన్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. జనసేన ఉండి ఇంచార్జి జుత్తుగ నాగరాజు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు జీవి నాగేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వ నాథరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వర రావు, జనసేన మండలాధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు, తోట ఫణిబాబు, అద్దాల శివరామరాజు, ఆరేటి కృష్ణ, కందులపాటి వీరరాఘవులు, కట్రెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సాగుభూమి కోసం ఆమరణ నిరాహార దీక్ష

విశాలాంధ్ర - బుట్టాయగూడెం: సాగు భూమి కోసం ఒక దళిత కుటుంబం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టింది. స్థానిక రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బాషా రంపాలరాజు కుటుంబీకులు బుట్టాయి గూడెం పంచాయతీ మర్రిగూడెంలో తమకు చెందిన సాగు భూమిని పోలీసు,రెవెన్యూ శాఖ తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బుట్టాయిగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బాషా శ్యాంబాబు మాట్లాడుతూ తమ కుటుంబానికి మర్రిగూడెంలో సర్వే నెంబరు 415లో య. 10-58 సెంట్లు, సర్వే నెంబరు 416 లో య. 4-28 సెంట్లు, సర్వే నెంబరు 417/1లో య 8-50 సెంట్లు, మొత్తం య 23-36 సెంట్లు భూమి ఉన్నట్లు చెప్పారు. ఈ భూముల్లోకి మర్రిగూడెం గ్రామస్తులు అక్రమంగా ప్రవేశించి, కర్రలు,

కత్తులతో తమపైకి అక్రమంగా దండెత్తి వస్తున్నారని అన్నారు. ఈ భూమిలో నుండి వెళ్లకపోతే చంపుతామని, ఇప్పటికి మూడుసార్లు తమపై దాడులు చేసినట్లు చెప్పారు. తమ పొలంలో ఉన్న జీడి మామిడి తోట, మామిడి తోటలో పనిచేస్తూ ఉండగా వచ్చి ఈ భూములు తమవని, భూములు ఖాళీ చేసి బయటకు పొమ్మని, తమపై దౌర్జన్యం చేసి, బెదిరించినట్లు చెప్పారు. తమపై దాడులు చేస్తున్న మర్రిగూడెం గ్రామస్తులపై శాఖా పరమైన చర్యలు తీసుకుని, తమ భూములు తమకు అప్పగించాలని అధికారులు కోరుతున్నట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ ఆస్తులు వేలానికి జిల్లాస్థాయి కమిటీ

విశాలాంధ్ర-ఏలూరు: స్పెషల్ కోర్టు ఏలూరు వారి ఉత్తర్వులు, ప్రభుత్వ జి.వో. నెం.519, ఏప్రిల్ 9వ తేదీ మేరకు అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేయడానికి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రెవిన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా రిజిస్ట్రార్, డిపిఆర్ఓ,జిల్లా ఐటి అధికారి(డిఐవో ఎన్ఐసి),సిఐడి అదనపు ఎస్పీ, నగరపాలక సంస్థ ఏవో, ఏలూరు స్పెషల్ కోర్ట్ అగ్రిగోల్డ్ సంస్థ సూచించిన పేర్ల సీతారామస్వామిని ఆథరైజ్డ్ మెంబరుగా జిల్లాస్థాయి కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సిఐడి అదనపు ఎస్పీ కమిటీ మెంబర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు. ఏలూరు అర్బన్, ద్వారకాతిరుమల మండల తహశీల్దార్లు, జిల్లాస్థాయి కమిటీకి, పోలీస్, సిఐడి దర్యాప్తు ఏజెన్సీల విచారణ సమయంలో వారికి సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెలుగు వీవోఏల నిరసనకు మద్దతుగా బహిరంగసభ

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో తొలగించ బడిన వివోఏలు పది రోజులుగా లింగపాలెంలో నిరసన దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని వివోఏ

అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుభాషిణి అన్నారు. ఏళ్ల తరబడి గ్రామాలలో వివోఏలుగా పనిచేస్తున్న వారిని అక్రమంగా తొలగించారన్నారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు తలొగ్గి వెలుగు అధికారులు పనిచేస్తున్నారని విమర్శించారు. తొలగించిన వివోఏలు ఆందోళన చేస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఇది చాలా అన్యాయమైన చర్య అంటూ విమర్శించారు. బుధవారం మండల కేంద్రమైన లింగపాలెంలో వివిధ సంఘాల మద్దతుతో బుధవారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

వెదుళ్ళ అప్పారావు భార్య మృతి

శివపురంలో విషాదఛాయలు

విశాలాంధ్ర-చింతలపూడి: రజక సంఘం నాయకులు వెదుళ్ళ అప్పారావు భార్య వెదుళ్ళ పద్మ(52) మృతి చెందడంతో శివపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. చింతలపూడి మండలం శివపురం గ్రామానికి చెందిన పద్మ అనారోగ్యానికి గురి కావడంతో ఆస్పత్రికి వెళు తుండగా షుగర్ పెరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ రావడం ఆమె శరీరం వైద్యానికి సహకరించక పోవడంతో

నాలుగు రోజుల వైద్య సేవలు అనంతరం ఆమె మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం శివపురం గ్రామంలో ఆమె భౌతికకాయానికి సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతికి తెలుగు రైతు ఏలూరు జిల్లా అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. టిడిపి నాయకులు నరుకుళ్ళ రవి, ఎంపీటీసీ చీకటి రాజేంద్ర కపూర్, మాజీ ఉపసర్పంచి అన్నవరపు రాంబాబు, పోతులూరి పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ జుబ్బూరు దుర్గారావు,శివపురం గ్రామ ప్రజలు బంధు మిత్రులు తరలివచ్చి భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

కొనుగోలు చేస్తాం (1వ పేజీ తరువాయి)

సమీక్షించి ఆదేశించారు. సమావేశాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ప్రారంభించి ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్న అంశాలను మంత్రికి వివరించారు. అనంతరం మూడు జిల్లా జాయింట్ కలెక్టర్లు ఇప్పటి వరకూ తమతమ జిల్లాల్లో రబీ ధాన్యం సేకరణ ప్రగతిని వివరించగా, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులు, మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. ముందుగా కాకినాడ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రగతిని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వివరించినపుడు, ట్రాన్స్‌పోర్ట్ కొరకు ఉపయోగించే ట్రైలర్ల సర్టిఫికేషన్‌కు తీవ్ర జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యేలు తెలియజేయగా, రవాణా శాఖ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల ధాన్యానికి కూడా మద్దతు రేటు ప్రకారం పరిహారం అందించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంత్రిని కోరారు. బొండాలు రకం బాయిల్డ్ రైస్ సేకరణకు ఎఫ్.సి.ఐ. పర్మిషన్ కోసం కోరామని, పర్మిషన్ వచ్చే లోపు కొనుగోళ్లు కొనసాగించాలని పౌర సరఫరాల సంస్థ ఎండి డా మనజీర్ జిలాని సామూన్ మిల్లర్లను కోరారు. తూర్పుగోదావరి జిల్లా సమీక్షలో మూడు ప్రాజెక్ట్ ల క్రింద పంటలు సాగవుతున్నా గోకవరం మండలంలో రైస్ మిల్లులు లేవని, అందువల్ల ప్రభుత్వ పరంగా కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాటు చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. పెదపూడి మండలం రైతుల ధాన్యాన్ని సమీపంలో ఉన్న బిక్కవోలు మండలం రైస్ మిల్లులకు కాకుండా కాకినాడ జిల్లాలోని మిల్లులకు టై అప్ చేయడం వల్ల రైతులు రవాణా సమస్య ఎదుర్కొంటున్నారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులకు నష్టపోకుండా తడిసిన ధాన్యం అంతా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం నిమ్ము 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, దాట్ల సుబ్బరాజు, వనమాడి కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, బిఆర్ఏ-కోనసీమ జిల్లా జెసి టి నిశాంతి, తూగో జిల్లా జెసి ఎస్ చినరాముడు, మూడు జిల్లాల రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నున్నరామకృష్ణ (కాకినాడ), కర్రి వెంకటరెడ్డి (తూగో), సిహెచ్‌వివిఎస్ఎస్ చౌదరి (బిఆర్ఏ-కేఎస్), పౌరసరఫరాల సంస్థల జిల్లా మేనేజర్లు, పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి : ఆర్డీవో

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం చేయ్యాలని ఆర్డీఓ ఆర్. కృష్ణ నాయక్ డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు.సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన 'పి జి ఆర్ ఎస్ – మీ కోసం' వేదిక లో వచ్చిన అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పిజిఆర్ ఎస్– మీ కోసం' ద్వారా ప్రజల నుంచి 4 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదానికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పిజి ఆర్ఎస్ – మీకోసం'లో ప్రజల నుంచి 19 అర్జీల ను స్వీకరించడం జరిగిందని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కేతన గార్గ్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ నిర్వహణా, మౌలిక సదుపా యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామ లింగేశ్వరరావు, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వి. వినూత్న, ఎస్.ఈ ఎం సిహెచ్ కోటేశ్వరరావు, సిటీప్లానర్ జి కోటయ్య పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం సీనియర్ సివిల్ జడ్జి సందర్శన

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : సోమవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి. ఎన్.శ్రీ లక్ష్మి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. కారాగారంలోని ఖైదీలతో, ఖైదీల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి తరపున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటీషన్లు, పై కోర్టుల్లో అప్పీలు వెయ్యాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని తెలిపారు. ఇందుకోసం సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్లకు అర్జీలు సమర్పించాలన్నారు. ముద్దాయిలు, ఖైదీల గురించి పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించు కోవాలన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి : ఆర్డీవో

విశాలాంధ్ర – కొవ్వూరు : మీ కోసం అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి డివిజన్, మండల స్థాయిలో వారానికి రెండు రోజులు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. సోమవారం స్థానిక కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన 'పి జి ఆర్ ఎస్–మీ కోసం' వేదికలో వచ్చిన అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ మీకోసం పిజి ఆర్ఎస్ ద్వారా సోమవారం 5 అర్జీలు వచ్చాయని తెలిపారు. వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా అధికారి, డివిజన్ , మండల అధికారులతో సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మీ కోసంలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, వారు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు వారి సమస్యలను నేరుగా 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చెయ్యవచ్చు నని పేర్కొన్నారు. అర్జీ పరిష్కార స్థాయి తెలుసుకునే వెసులుబాటు ఉందన్నారు.

మీకోసంలో వచ్చిన అర్జీల వివరాలు

నిడదవోలు మండలం, కలవచర్ల గ్రామానికి చెందిన మల్లిపూడి మహాలక్ష్మి, నా సొంత ఇంటిని ఆక్రమించుకొని నాపై దౌర్జన్యం చేస్తున్నారని, నాకు న్యాయం చేయాలని అర్జీ పెట్టుకున్నారు. పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన ఉమ్మడి మార్గానికి చెందిన వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఏవో రవి విక్రమ్, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాలాంధ్ర – అమలాపురం : ఏఐటీయూసీ జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద డిమాండ్స్ డే కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చింది. ఎఐటీయుసి/సీపీఐ సంయుక్త పిలుపులో భాగంగా సోమవారం ఉదయం అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దనిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు సిపిఐ జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె సత్తిబాబు హాజరై మాట్లాడుతూ ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాస రావు, మీసాల గోపి, మిరియాల ఏసు రత్నం, ఆంధ్ర ఆటో వాలా యూనియన్ (ఎఐటీయూసీ) డివిజన్ అధ్యక్షుడు బి గౌరీశంకర్ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కామిశెట్టి చంద్రరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మోకా శ్రీనివాసరావు, శ్రామిక మహిళా సంఘం (ఎఐటీయూసీ) నాయకురాలు పోతుల సాయమ్మ సీతమ్మ, లక్ష్మి, దుర్గా, జట్లు లేబర్ యూనియన్ (ఎఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కురచ నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్‌లు హాజరు అయ్యారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి జిల్లా కలెక్టర్ ద్వారా పలు సమస్యలు పరిష్కారానికి కార్యాచరణను ప్రకటించాలని కోరుతూ మెమోరాండం అందజేశారు. 35000 కనీస వేతనం అమలు చేయాలని 8వ పిఆర్సీ అమలు చేయాలని అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకు రావాలన్నారు. రవాణా రంగం కార్మికులకు సంక్షేమబోర్డ్ ఏర్పాటు చేయాలని కార్మిక చట్టాల సవరణ వెనక్కితీసు కోవాలన్నారు. రైతు ఉత్పత్తులకు లాభసాటి ధర నిర్ణయించి దానికి చట్టబద్ధత కల్పించాలని, భూ సేకరణ చట్టం ఖచ్చితంగా అమ లు చేయాలని, 6.33 శాతం మహిళ రిజర్వేషన్లు అన్నిటా అమలు చేయాలని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామి పథకం నిధులు మంజూరు పెంపు చేసి కార్మికుల వేతనాలు పెంచాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే భీమా పథకం ప్రీమియం కార్మికుల పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలన్నారు. అదే విధంగా వివిధ డిమాండ్లు చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

విశాలాంధ్ర – కాకినాడ : త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీ–2025కు హాజరవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా కోచింగ్ అందించనున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కాకినాడలో క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తుందన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఆర్థికంగా వెనకబడిన నిరుద్యోగ యువత శిక్షణకు వేలాది రూపాయలు వెచ్చించలేక ఇబ్బందులు పడుతున్నారని, దీని అధిగమించి నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు కాకినాడలో ప్రసిద్ధి చెందిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ ద్వారా అభ్యర్థులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన శిక్షణతో పాటు డైలీ టెస్ట్ సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 7న లోపు గూగుల్ ప్లే స్టోర్ నుండి 'శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆచార్య' యాప్‌ను ఇన్స్టాల్ చేసుకుని తగినన్ని వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మెగా డీఎస్సీకి హాజరవుతున్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాకినాడ విద్యుత్ నగర్‌లో క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు.

'జముకు' దీర్ఘ కావ్యం పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర – రాజోలు : ఉద్యమ కవి బత్తుల మురళీకృష్ణ రచించిన 'జముకు' దీర్ఘ కావ్యం పుస్తకం ఆవిష్కరణ పాలకొల్లు అంబేద్కర్ సామాజిక భవనంలో కుసుమ ధర్మన్న సాహిత్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కవి కోలాటి పెద్దిరాజు అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం రాజోలు పట్టణంలో సోమవారం జరిగిన దళిత చైతన్య వేదిక సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా మొదటితరం దళిత కవి కుసుమ ధర్మన్న జయంతోత్సవాల కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ రచించిన 'జముకు' దీర్ఘ కావ్యం పుస్తకాన్ని ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి, బహుజన రచయితల వేదిక ప్రతినిధులు నేలపూరి రత్నాజీ, తంగిరాల సోని, రాజోలు వైస్ ఎంపీపీ పాలుమూరి శ్యాంబాబు, ముస్లిం రచయితల సంఘ ప్రతినిధి షేక్ ఆలియా తదితరులు ఆవిష్కరించరన్నారు. బత్తుల మురళీకృష్ణ రచించిన జముకు దీర్ఘ కావ్యం దళితులను ఉత్తేజితులను చేస్తూ, దళితులను విభజించి లబ్దిపొందాలనుకున్న రాజకీయ నాయకులను, దళారులను ఎండగట్టి విషపూరిత కుట్రలకు చెంపపెట్టుగా నిలుస్తుందని దళిత చైతన్య వేదిక నాయకులు తెలిపారు. జముకు పుస్తక ముద్రణకు ఆర్థిక తోడ్పాటు అందించిన ఎన్నారై మిత్రులు తాడి విజయకుమార్‌కు, తాడి శ్రీనివాసరావులకు పుస్తక రచయిత బత్తుల మురళీకృష్ణ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక నాయకులు మట్టా సురేష్ కుమార్, చిలకపాటి శ్రీధర్, మందపాటి మధు, మెడబల శేఖర్, పొన్నమాటి భాస్కర్, చింతా శ్రీనివాస్, మోకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వేసవి దృష్ట్యా బ్లడ్ బ్యాంకులలో రక్తం నిధులు కొరత నివారణ కొరకు ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పర్యావరణ మిత్ర, పెదబ్రహ్మదేవం శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు తోటకూర గంగాధర్ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను 30వ సారి రక్తదానం చేయడం ఆనందంగా ఉంది అని తెలిపారు. రక్తం ఇచ్చిన తర్వాత నీరసం వస్తుందని శక్తి తగ్గిపోతుంది అని అనవసర అపోహలు చెంది రక్తదానం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని, ప్రతీ ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండు పర్యాయాలు నిస్సందేహంగా రక్తదానం చేయవచ్చు అని సూచించారు. 30 సార్లు రక్తదానం చేయడం అభినందనీయం అని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి, రిజిస్ట్రార్ డా జి సురేష్, గ్రంథాలయ అధిపతి కె అశోక్ కుమార్ గంగాధర్‌కు అభినందనలు తెలియజేశారు.

ప్రపంచ శాంతిని కోరుతూ చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర – ఆత్రేయపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన శ్యామ్ జాదూగర్ మాయా ఈ బడి ఆధ్వర్యంలో స్థానిక అనూస్ హోమ్‌లో 1929 మే 5న గాంధీజీ ర్యాలి సందర్శించి విదేశీ వస్తు బహిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా దానిని గుర్తు చేసుకుంటూ గాంధీ వచ్చిన వేళ అనే కార్యక్రమం ద్వారా చిన్నారుల ప్రపంచ శాంతి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ముస్లిం క్రైస్తవ చిన్నారులు కాశ్మీర్లోని పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ముందుగా స్థానిక గాంధీ సెంటర్లో ఉండే గాంధీ విగ్రహానికి చిన్నారులు పుష్పాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రపంచ శాంతిని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్యామ్ మాట్లాడుతూ చిన్నారుల్లో దేశభక్తిని రగిలించేలా గత 30 సంవత్సరాలుగా గాంధీ వచ్చిన వేళ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : కమిషనర్

విశాలాంధ్ర – సామర్లకోట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కోరారు. సోమవారం మెప్మా కార్యాలయంలో డ్వాకా సీఈఓతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాయితీపై ఈ పథకం లభిస్తుందని, 1కేవీ నుంచి 3 కేవీ వరకు విద్యుత్తు పథకం వర్తిస్తుందన్నారు. సీఎంఎం హెల్సేన్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

మూలారెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - అనపర్తి : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యులు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డి జయంతి వేడుకలు పెద్ద ఎత్తున నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం దొడ్డిగుంటలో ఏర్పాటు చేసిన మూలారెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే నల్లమిల్లి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 8న మూలారెడ్డి జయంతి నియోజకవర్గంలోని నాలుగో మండలాల్లో ఘనంగా నిర్వహించనున్నామని అదే రోజు సాయంత్రం దొడ్డిగుంటలో ఏర్పాటుచేసిన మూలారెడ్డి విగ్రహావిష్కరణ జరుగుతుందని చెప్పారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాస్, సీనియర్ టిడిపి నేతలు మాజీ మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, యనమల రామకృష్ణుడు,జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు, ఇంకా పలువురు ప్రముఖులు విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహనీయుడు కారల్ మార్క్స్

విశాలాంధ్ర -కొవ్వూరు : ప్రపంచ కార్మికుల విముక్తి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు కారల్ మార్క్స్ అని సీపీఎం నాయకులు పడాల గంగాధర్ అన్నారు. కొవ్వూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో కారల్ మార్క్స్ 207 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగాధర్ మాట్లాడుతూ సమాజంలోని నిమ్నవర్గాలకి పేద ప్రజలకు పూర్తి స్వేచ్ఛ స్వతంత్రం కావాలని పోరాటం చేసిన వ్యక్తి మార్క్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దగ్గు రాధాకృష్ణ ఎం జ్యోతిబసు కరగని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని విద్యార్థులు గ్రంథాలయాలను సద్వి నియోగం చేసుకోవాలని దేవరపల్లి మండలం ఎర్నగూడెం శాఖా గ్రంథాల అధికారి జి అనిత అన్నారు. వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా దేవరపల్లి మండలం ఎర్నగుడేం శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు సెస్ నేర్పించడం నీతి కథలు వివిధ అంశాలపై విద్యార్థు లకు అవగాహన కల్పించారు. అలాగే నీతి కథలు చెప్పడం వల్ల విద్యార్థులకు మాట్లాడే నైపుణ్యత పెంపొందించుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. విద్యార్థులకు పెయింటింగ్ పై డ్రాయింగ్ క్రాఫ్ట్ మాస్టర్ ఎం కొండలరావు విద్యార్థులకు పెయింటింగ్ డిజైన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం మురళి బి సుగుణ గ్రంథ పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వినతి

విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం : ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని తమ నియోజకవర్గంలో రైతులకు నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ కోరారు.ఏపీ పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ జిల్లాకి సోమవారం విచ్చేశారు. దీంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మంత్రి మనోహర్‌ని కాకినాడలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలోని రాజానగరం,కోరుకొండ,సీతానగరం మూడు మండలాల పరిధిలో ధాన్యం పండించిన రైతుల వద్ద నుండి ఇప్పటికే ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేసిందని, ఇంకా మిగులు ధాన్యం రైతుల వద్ద నుంచి వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నరనీ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కోతలు కోసి ఉన్న మిగిలిన రైతుల నుండి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.రాష్ట్రంలో వరి రైతుల వద్ద నుండి ఆఖరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్ని విధాల రైతులకు అండగా ఉంటుందని, ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల జనసేన పార్టీ అధ్యక్షులు వేగిశెట్టి రాజు, నాయకులు నాతిపం దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.రాజానగరం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వ లెక్కలు ప్రకారం ఇంకా 11,280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సిన్నది. దీనిలో భాగంగా రాజానగరం మండలంలోనీ సంపత్నగరంలో 250 మెట్రిక్ టన్నులు, యర్రంపాలెంలో 300, ముక్కినాడ లో 100, తోకాడలో 2,100,నందరాడలో 150, నరేంద్రపురంలో 50 మెట్రిక్ టన్నులు చొప్పున ఉండగా సీతానగరం మండలంలో పురుషోత్తపట్నం లో 100 మెట్రిక్ టన్నులు,నాగంపల్లి లో 580,మిర్తిపాడులో 80, రఘుదేవపురంలో 3,120, చిన్న కొండేపూడిలో 600,ముగ్గళ్ళలో250 తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చెయ్యాల్సి వుందని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం: లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో సీతానగరం, చినకొండేపూడి, సింగవరం, వంగలపూడి గ్రామాల్లో సోమవారం 1,15,102 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ నా సేన నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సల అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల కోసం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. నలుగురు లబ్ధిదారులకు రూ.1,15,102లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాపాక పంచాయతీ సరిహద్దులపై అర్జీ : ఎంపీడీవో

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో సీతానగరం గ్రామ పంచాయతీ పరిధిలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఓ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు వచ్చాయని ఎంపిడిఓ ఎమ్ భారతి అన్నారు. ఎంపిడిఓ ఎమ్ భారతి మాట్లాడుతూ ఐదు అర్జీలు వచ్చాయని దీనిలో సి ఎచ్ బుజ్జి అనే వ్యక్తి రాపాక గ్రామ పంచాయతీ సరిహద్దులు నిర్ణయం చాలని అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. అన్నపూర్ణ, ప్రసన్న కుమార్, సాయి కుమార్ ఇళ్ళ స్థలం సర్వే చెయ్యించాలని అర్జీ ఇచ్చారు. దీంతో పాటు అన్నపూర్ణ తన పేరుపై ఉన్న పొలం మీద కౌలు దారుడు లోన్ తీసుకోవడం జరిగింది అని నాకు లోన్ మంజూరు చేయించాలన్నారు. ఈ అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు బదిలీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి మూర్తి, ఏ ఈ ప్రకాష్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం : శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య విద్యా ప్రాంగణం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డా ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డా జి సురేష్ పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో డా ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ పెద్దాపురం, యువసేన బ్లడ్ బ్యాంక్ కాకినాడ వారు రక్తాన్ని సేకరిం చటం జరిగింది అని డా శ్రీనివాస రెడ్డి తెలియజేశారు. రక్తదానాన్ని సిబ్బంది, విద్యార్థులందరూ ఒక అలవాటుగా మార్చాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 318 యూనిట్ల బ్లడ్ ప్యాకెట్లను సేకరించగా వివిధ విభాగాల డీన్‌లు, బ్లడ్ బ్యాంక్‌ల ప్రతినిధులు డాక్టర్లు, వివిధ విభాగాధిపతులు, ఆదిత్య యూత్ రెడ్ క్రాస్ యూనిట్ కో ఆర్డినేటర్ పి శివకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్. బి రాంబాబు, లియో క్లబ్ కో.ఆర్డినేటర్ ఎన్ నరేశ్, డా రఘునందన్, గ్రంథాలయ విభాగాధిపతి కె అశోక్ కుమార్, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన

విశాలాంధ్ర - కొవ్వూరు : సమీకృత వ్యవసాయ విధానంలో రైతుల జీవన విధానంలో సుస్థిరత సాధించ దానికి ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరత లక్ష్మి సూచించారు. సోమవారం రైతు సదస్సు-వ్యవసాయ ప్రదర్శన సందర్భంగా కొవ్వూరు మండలం, ధర్మవరం గ్రామంలో జిల్లా ఏరువాక కేంద్రం, రాజమహేం ద్రవరం, శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సభకు అధ్యక్షత వహించి ఆమె ప్రసంగించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత పరిజ్ఞానము, యాంత్రీకరణ, నూతన వంగడాలపై అవగాహన పెంచుకోవాలని ఆమె కోరారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా. చల్లా వెంకట నరసింహరావు, మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డా. టి. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధ వరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్.సి. హెచ్. వి.నరసింహారావు, మానుకొండ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ నేరేడిమిల్లి నాగమణి, ఎంపీటీసి రోహిణి కోమలి పాల్గొన్నారు.

ఉపాధిహామీ కార్మికులకు పనికల్పించాలని వినతి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, జేగురుపాడు గ్రామీణ ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించమని కోరుతూ సర్పంచ్ వై సతీష్ చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ శ్రామికులు కడియం ఎంపీడీవో కే రమేష్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడియం మండలంలో అత్యధికంగా ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న గ్రామం జేగురుపాడు గ్రామం అని పేర్కొన్నారు. ఇటీవల తమ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండు చేసినట్లు తెలిసిందని, ఆయన విధుల నుంచి తప్పుకున్న తరువాత తమకు ఏ విధమైన పనులు కల్పించడం లేదని వాపోయారు. అయితే ఇటీవల టిఏ వచ్చి, తమతో రెండు రోజులు పని చేయించినట్లు, ఆన్లైన్లో తమ హాజరు నమోదు కాలేదని చెబుతున్నారు. మురుగు కాల్వలో పని చేయుట వలన చర్మవ్యాధులు వస్తున్నా లెక్క చేయకుండా, పని చేసినప్పటికీ హాజరు నమోదు చెయ్యకపోవడం దారుణం అన్నారు. అదేవిధంగా గతంలో తాము పని చేసిన రోజులకు ప్రతీ ఒక్కరికి పేస్లిప్ ఇచ్చేవారని, దానిలో తాము చేసిన పని దినాలు మరియు ఇతర విధులు ఉండేవని, కానీ ఇప్పుడు మాకు ఆ విధంగా వివరములతో కూడిన స్లిప్‌లు ఇవ్వకపోవడం వల్ల, పని చేసి నష్టపోతున్నామన్నారు. గతంలో లాగా పేస్లిప్పులు ఇప్పించాలనికోరారు. రాజకీయస్వార్థ ప్రయోజ నాలకు తమను బలిపశువులుగా చేస్తూ, తమకు పనులు లేకుండా చేస్తూ, ఆటంకములు కల్పించుటకు చేస్తున్న కుట్రలనుండి ఉపాధి హామీ శ్రామికులను రక్షించి, పని కల్పించవలసినదిగా ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు.

శానిటేషన్ సిబ్బందిని పెంచాలలి : సీపీఐ

విశాలాంధ్ర - కాకినాడ : సిబ్బంది కొరత వలనే పారిశుద్ధ్యం కుంటుబారుతుందని 30మంది సిబ్బందిని మూడు సంవత్సరాల నుండి పోస్టు నియమాలకు ఆదేశాలు ఉన్న ఇంత వరకు భర్తీ చేయకపోవడంవలనే ఈసమస్య వస్తుందని సిపిఐ పార్టీ తరుపున కూడా అనేకసార్లు కమిషనర్‌కి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని సోమవారం పాడా కార్యాలయంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో పిఠాపురం సిపిఐ కార్యదర్శి సాకా రామకృష్ణ అర్జీ రూపంలో పీడీ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ పట్టణ జనాభా ప్రతిపాదన ప్రకారం సిబ్బందిని నియమించకుండా అరకొర సిబ్బందితో అదనంగా శానిటేషన్ పనులు జరిపిస్తున్నారని, దానివలన కార్మికులకి పని ఒత్తిడి ఎక్కువవుతుందని, అదికాకుండా అదనంగా తడి చెత్త, పొడి చెత్త అనే కార్యక్రమని వెలుగులోకి తెచ్చి ఉన్న సిబ్బందితో పని చేయించడం దారుణమని ఆయన ఆవేదన చెందారు. ఉపముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గం ముఖ్యపట్టణంలో తగిన పనిముట్లులేక అరకొర సిబ్బందితో పనిచేయించడం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు. పనిముట్లు, సిబ్బందిని పెంచి పారిశుద్ధ్యాన్ని మెరుగుపంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఖండవల్లి సుబ్బారావు, రిటైర్డ్ మున్సిపల్ వర్కర్ అల్లం పాపారావు, కె గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడిగా స్వర్ణపూడి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కాకినాడ జిల్లా పూర్వాధ్యక్షులు స్వాతి ప్రసాద్, కార్యదర్శి సుంకర ప్రసాద్, ఎన్నికల అధికారి దురాని ల ఆధ్వర్యంలో కాకినాడజిల్లా మహాసభ కాకినాడ పట్టణంలోని జేఎన్టీయూ అల్లుమిని ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు ప్రభుత్వ విప్ యనమల రామకృష్ణుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాకినాడ జిల్లా ఏపిడబ్ల్యూజే నిర్వహించిన ఈఎన్నికలలో భాగంగా కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులుగా ఏలేశ్వరంకు చెందిన ఆంధ్రప్రభ పత్రిక విలేకరి స్వర్ణపూడి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీనివాసరావును పలువురు విలేకరులు సత్కరించారు. ప్రజా ప్రతినిధులు ఏలేశ్వరం చైర్పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య, టిడిపి యువ నాయకులు బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, మండల ఎంపీపీ గొల్లపల్లి నరసింహామూర్తిశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహచర పాత్రికేయులు శిడగం శ్రీనివాసరావు, పారేపల్లి గంగా ప్రసాద్, దొంతంశెట్టి సతీష్, తొగరా సూరిబాబు, షేక్ హుస్సేన్, షేక్ ఇమ్రాన్, దాసరి కృష్ణ, ఎస్ మల్లికార్జునరావు, ఆకుల శివాజీ సత్కరించారు.

ప్రపంచ మానవాళికి మార్గదర్శి కారల్ మార్క్స్ సిద్ధాంతం

విశాలాంధ్ర - జగ్గంపేట : కార్ల్ మార్క్స్ సిద్ధాంతమే ప్రపంచ మానవాళికి మార్గదర్శి అని ఏపీ ఆర్సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఉద్ఘాటించారు. కారల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలను సోమ వారం మండలంలోని రామవరం రంగవల్లినగర్ వద్ద ఏపీ ఆర్సిఎస్, ఏఐఎఫ్టియు, పిడిఎస్యు (వి), పిఓడబ్ల్యు (స్త్రీ విముక్తి) తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నాకుల మాట్లాడుతూ కారల్ మార్క్స్ ప్రపంచ గతిని మార్చిన తత్వవేత్త, శ్రామిక ప్రజల మార్గదర్శి, సమ సమాజ నిర్మాణ సిద్ధాంతకర్త అని కొనియాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి రమేష్, ఏఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, పిడిఎస్యు (వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ఏపీ ఆర్సిఎస్ జిల్లా నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, జాను, సభాష్టియన్, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, NARASIMARAJ (New Name), S/O RANGARAJU, Previously **Called NARASIMRAJ (Old Name),** Resident of 9-A, Third Main Road, Kumaran Nagar Extn Lawspet, Puducherry-605008. I have changed my name from **NARASIMRAJ (Old Name)** To **NARASIMARAJ (New Name)** for all practical purposes.

జీజీహెచ్‌కు రూ.55 లక్షల ఎక్విప్మెంట్స్ అందజేత

విశాలాంధ్ర - కాకినాడ : నిత్యం వేలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ రూ.55 లక్షలతో ఎక్విప్మెంట్ అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి సామాజిక బాధ్యత కింద కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ ప్రజా సంక్షేమర్థం విరాళంగా అందించిన 3 వెంటిలేటర్లను, 8 మల్టీపారా మానిటర్లు, 8 ఐసీయూ పడకలు, 8 గైనకాలజీ పరిశీలన బెంచీలను సోమవారం జీజీహెచ్ ట్రామా కేర్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ పట్టణం శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసు, కేఎస్పీఎల్ ఎండీ కెవి రావు తదితర ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభిచి జీజీహెచ్ వైద్యులకు అప్పగించారు. అనంతరం సర్జరీ సెమినార్ హాల్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు సంబంధించి ఈ రోజు చాలా ప్రత్యేకమైన దన్నారు. సంవత్సర కాలంలో రూ.55 లక్షలతో ఎక్విప్మెంట్ సమకూర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు విరివిగా వైద్య సేవలు అందిస్తున్న జీజీహెచ్ వైద్య సేవలను మరింత బొలోపేతం చేసేందుకు కేఎస్పీఎల్ గొప్ప తోడ్పాటును అందించిందని ఈ సందర్భంగా కేఎస్పీఎల్ ఎండీ కేవీ రావుకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగైదు జిల్లాల నుంచి ప్రజలు నిత్యం జీజీహెచ్‌కు వైద్య సేవలు నిమిత్తం వస్తూ ఉంటారన్నారు. రంగరాయ వైద్య కళాశాలకు

టీచింగ్ ఆసుపత్రిగా జీజీహెచ్ అనుబంధంగా పనిచేస్తూ భవిష్యత్తు తరాలకు వైద్య సేవలను అందించే వైద్యులను అందిస్తుందన్నారు. క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్న నేపథ్యంలో త్వరలో జీజీహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పీఎం స్వీయ సురక్ష యోజన కింద పీఎం నరేంద్ర మోదీ సహకారాన్ని కోరడం జరుగుతుందని, జీజీహెచ్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు బాధ్యతగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి కొండబాబు మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కాకినాడ జీజీహెచ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీజీహెచ్ అభివృద్ధికి చాలా ప్రణాళికలు సిద్ధం చేస్తుందని, నిర్మాణంలో ఉన్న ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం పనులు పూర్తయితే భవిష్యత్తులో 500 పడకలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. కేఎస్పీఎల్ ఎండీ కేవీ రావును జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే తదితరులు ప్రత్యేకంగా సత్కరించి, ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, కేఎస్పీఎల్ సీఈవో మురళీధర్, వివిధ విభాగాల వైద్య అధికారులు, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - కాజులూరు : వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ తెలిపారు. సోమవారం గొల్లపాలెం కోళ్ల తూము సెంటర్లో పలు వాహనాలు తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా లేని వాటికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఇటీవల చోరీలు జరుగుతున్నాయని, పలు వాహనాలు రికార్డులు లేకపోవడంతో కేసులు తరగతిగతిన చేయలేకపోతున్నామని ఆయన అన్నారు. ప్రతిరోజు నిర్దేశించిన కేంద్రాల్లో నిఘా ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలను, వాహనదారులకు జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని దివ్య కళ్యాణానికి తరలిరండి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవానికి తరలిరావాలని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సత్యదేవుని కళ్యాణానికి భక్తులకు తెలియపరుస్తున్నారు. సత్యదేవని దివ్య కళ్యాణ మహోత్సవం ఈనెల 7 నుంచి 13 వరకు వైభవంగా జరుగుచున్నవని ఆయన ప్రచారంలో తెలుపుతున్నారు. కృష్ణబాబు మాట్లాడుతూ స్వామి కల్యాణానికి భక్తులు అందరూ తరలి రావాలని అన్నవరం రత్నగిరిపై బుధవారం సాయంత్రం 4గంటల నుండి స్వామి, అమ్మవార్లను పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలుగ తయారుచేయుట ముత్తయిదువులు పసుపు దంచడం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. గురువారం రాత్రి 9.00 గంటల నుండి స్వామివారి కళ్యాణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులతో పాటు దేవస్థానంవారు తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు స్వీకరించాలన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుండి కొండ దిగువన స్వామివారి రథోత్సవంలో భక్తులు పాల్గొనాలని.13 మంగళవారం రాత్రి 7.30 నిత్యకళ్యాణ మండపంలో స్వామివారి పుష్పయోగ మహోత్సవం జరుగుతుందన్నారు. మహిళా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు జాకెట్ ముక్క, పసుపు కుంకుమ తీసుకోవాలని ఆయన తెలిపారు. స్వామివారికి జరిగే ప్రతి కార్యక్రమంలోను పాల్గొని సత్యదేవుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి : ఆర్డీవో

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అందిన అర్జీలపై సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలను త్వరితగతిన అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి జె వెంకటరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, ట్రైనీ కలెక్టర్ జె మనిషా, హౌసింగ్ పిడిఎన్‌వివి సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, సిపిఓ త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాసరావులతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆయన సావధానంగా ఆలకించి, వారీ

అర్జీలపై సత్వర పరిష్కారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానంగా రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఆక్రమణల తొలగింపు, ఉపాధి కల్పన, సదరమ్ సర్టిఫికేట్ల జారీ తదితర వ్యక్తిగత సమస్యలతో పాటు, ఆయా ఆవాసాల్లో ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై ప్రజల నుండి 351 అర్జీలు అందగా వాటన్నిటినీ పిజిఆర్ఎస్ పోర్టల్‌లో ఆన్ లైన్లో అప్ లోడ్ చేసి, అర్జీదారులకు రశీదులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టర్ కార్యాలయ సెక్షన్ సూపరిండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించాలి : రైతు కూలీ సంఘం డిమాండ్

విశాలాంధ్ర - జగ్గంపేట : తడిచిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. జగ్గంపేట మండలం కాట్రావుల పల్లిలో రెండోరోజు ఆందోళన నిర్వహించడంతో స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందించి ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులతో ఫోన్లో మాట్లాడారు. మద్దతు ధర కల్పించి ధాన్యం కలిగించడం జరుగుతుందని నెహ్రూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి రమేష్, ఏపీ ఆర్సిఎస్ జిల్లా నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, జాను, సెబాస్టియన్ రైతులు సత్యనారాయణ, వీరస్వామి, వెంకటేశ్వర్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు యువకుడి మృతి

విశాలాంధ్ర - రాజోలు : సఖినేటిపల్లి మండలంలోని గుడిమూలలో విద్యుత్ షాక్‌కు గురై యువకుడు గొర్ల రవి కిరణ్ (34)మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. లైన్ మెన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవి కిరణ్ విద్యుత్ స్తంభం ఎక్కి రిపేర్ చేస్తుండగా విద్యుత్ సరఫరా అవ్వడంతో కిరణ్ మృతి చెందాడు. స్తంభంపైన గిలగిలా కొట్టుకుంటూ ప్రాణాలు విడిచాడని స్థానికులు తెలిపారు. విద్యుత్ లైన్మేన్లు పోల్ ఎక్కకుండా ప్రైవేట్ వ్యక్తులను ఎక్కించి ప్రాణాలు తీస్తున్నారంటూ కిరణ్ కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. చేతికంది వచ్చిన కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

విశాలాంధ్ర : తాళ్లపూడి ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యవంతమైన, నాణ్యమైన ఉత్పత్తులు లభిస్థాయి అని గ్రామ సర్పంచ్ కోమ్మిరెడ్డి పరస రామారావు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు రైతులు ఇటీవల పండించిన వరి మంచి దిగుబడులు వచ్చాయని ఒక్క వరే కాకుండా మిగతా పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంలో వేగేశ్వరాపురం రైతు భరోసా కేంద్రంలో రైతులు పెట్టా సుబ్బారావు, తైలం చంద్ర శేఖర్, పోతిరెడ్డి గానిరాజు, తైలం వీర వెంకట సత్యనారాయణ లకు సర్పంచ్ కొమ్మరెడ్డి పరశు రామారావు చేతుల మీదుగా సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగాంజనేయులు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అగ్రికల్చర్ అసిస్టెంట్ వరలక్ష్మిలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర- తాళ్లపూడి : తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో ఆక్రమణలు తొలగించి గ్రామాభివృద్ధికి, పంచాయతీ తీసుకున్న నిర్ణయాల అమలుకు సహకారం అందించాలని గ్రామ సర్పంచ్ తీగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణలు ఆర్డీవోకు విన్నవించుకున్నారు. ఆక్రమణలకు గురైన స్థలాలు, గోడలను, మెట్లను, చెట్లను అన్నింటినీ గతం లోనే పంచాయతీ తీర్మానం ద్వారా కొన్ని పనులు చేయటం జరిగిందన్నారు. మరికొన్ని పనులకు అధికారుల సహాయం కోరామని ప్రెసిడెంట్ తిరిగిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణలు తెలిపారు.



ప్రతి గింజ కొనుగోలు చేస్తాం : మంత్రి

విశాలాంధ్ర - జగ్గంపేట : రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యం రాశులను ఆయన సోమవారం అధికారులు, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి బరోసా కల్పించారు. దళారులను నమ్మి మోస పోవద్దని రైతులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారు. వారిని ప్రోత్సహించవద్దని రైతులకు సూచించడం జరిగిందన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం రబీలో 25 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే కూటమి ప్రభుత్వం ఈ రబీలో ఇప్పటికే 59 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందన్నారు. అలాగే సొమ్ములను వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అకాల వర్షాల ప్రభావం కొన్ని ప్రాంతాల మీద అధికంగా పడిందని రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎవరు అపోహలు నమ్మవద్దని మనోహర్ తెలిపారు. రైతుల సమస్యను సీఎం, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి తప్పనిసరిగా న్యాయం చేస్తామన్నారు. మంత్రి పర్యటనలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం దేవులా నాయక్, వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ కుమార్, సహకార శాఖ అధికారులు, మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్, తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెద్దాపురం : ఇటీవల సంభవించిన అకాల వర్షం కారణంగా తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని జె తిమ్మాపురంలో గ్రామంలో సోమవారం తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దన్నారు. రైతుల ధాన్యానికి తేమ శాతంతో పాటు ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు. అనంతరం రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, మేనేజర్ దేవులా నాయక్ వ్యవసాయ శాఖ జేడి విజయ్కుమార్, కుడా చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజ కొనుగోలు చేయండి : ఎంపీ

విశాలాంధ్ర -పోలవరం : రబీ సీజన్లో భాగంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు సోమవారం బయలుదేరిన ఎం.పి పుట్టా మహేష్ కుమార్ మార్గమధ్యలో గూటాల,పట్టిసం వద్ద రహదారిపై ఆరబోసిన రాశులను ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లక్ష్యం మేరకు దాన్ని సేకరణ పూర్తయిందని అధికారులు చెబుతున్నారని, తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. వ్యవసాయ శాఖ అధికారి అందుబాటులో ఉండటం లేదని పలు రైతులు ఎంపీ మహేష్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. ఎంపీ మహేష్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారికి ఫోన్ చేసి బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం పట్టిసం సమీపంలో రహదారి పక్కన ఆరబోసిన మొక్కజొన్న కండేలను పరిశీలించిన ఎంపీ మహేష్ కుమార్ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలోని దాచవరం పంచాయతీ నెమలిపేట గ్రామ ప్రాంతంలో పని చేస్తున్న ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి.ఈ ప్రమాదంలో సుమారు 10 మంది ఉపాధి కూలీలు గాయపడ్డారు. పనిచేస్తున్న ప్రదేశంలో సమీపంలోని చెట్టుకు పెట్టిన తేనెటీగల గుంపు చెలరేగి ఉపాధి కూలీలపై దాడి చేశాయి. గాయాలు పాలైన కంటిపల్లి శిరీష, కంటిపల్లి కుమారి,పట్ల దుర్గమ్మ, కారం రామారావు, కారం భద్రమ్మ, వర్సా సీత,కొలురి శిరీషలను ఉపాధి హామీ సిబ్బంది కుక్కునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.కాగా చికిత్స సకాలంలో అందించడంతో కూలీలకు ప్రాణాపాయం తప్పింది.

అర్జీల పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: అర్జీదారుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారిని గౌరవంగా చూసు కోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు.ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 226 దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రతిభావంతులు, దివ్యాంగులు వద్దకు వేదిక పైనుంచి కిందికి వచ్చి కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించి,వారి సావధానంగా విని వాటి పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వారితో పాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు,ఎస్ సి కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ వినతులు స్వీకరించారు.

రైతులను ఆదుకోవాలి : డేగా

విశాలాంధ్ర - ఏలూరు: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని, పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారాన్ని తక్షణం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం ఈదురు గాలులు,ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షాల వలన ఉమ్మడి పశ్చిమ,తూర్పుగోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లాలో అనేక చోట్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.లక్షల టన్నుల ధాన్యం అకాల వర్షానికి తడిసిపోయిందని,ఈ నేపథ్యంలో తడిసిన,రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి, జీడి మామిడి,అరటి, మొక్కజొన్న,కూరగాయలు, పొగాకు తదితర పంటలకునష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతాగానికి తక్షణం పంటల బీమా పథకాన్ని అమలు చేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. పిడుగుపాటుల వలన రాష్ట్రంలో 6గురు వ్యక్తుల మరణించారని,వారి కుటుంబాలకు తక్షణం రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని,అనేక చోట్ల చెట్లు కూలిపోయాయని దీనివలన విద్యుత్తుకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టి విద్యుత్ ను నిరాటంకంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం రక్షణ స్పందించి వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇన్సూరెన్స్ కాజేసిన లైన్‌మెన్?

సస్పెండ్ చేసిన నెలరోజులకే పోస్టింగ్ ..

విశాలాంధ్ర - అమలాపురం : ఐ పోలవరం మండలం పశువుల్లంక గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఉద్యోగి మోర్త సాయి విద్యుత్ శాఖలో ఒక లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ షాక్‌తో మరణించిన సంగతి విధితమే. మురమళ్ళ లైన్‌మెన్‌గా అప్పట్లో పని చేస్తున్న మాగాపు శ్రీను గోదావరికి వరదలు సమయంలో 11 కెవి విద్యుత్తు లైను మురమళ్ళ గోదావరి నదిపై నుండి ఐ పోలవరం కొమరగిరి సరఫరా 11 కెవి కట్ చేశాడని, అన్నంపల్లి టోల్గేట్ వద్దకు పవర్ కనెక్షన్ ఇవ్వడంకోసం ముమ్మిడివరం మండలం కొత్తలంక ఫీడర్ నుండి అన్నంపల్లి టోల్గేట్‌కు పవర్ ఇవ్వడం జరిగిందని స్థానికులు తెలిపారు. అయితే టోల్ గేట్ వద్ద లైన్ రిపేర్ చేయించడం కోసం ప్రైవేట్ ఉద్యోగి మోర్త సాయిని ఆ మండలానికి సంబంధం లేకపోయినా మురమళ్ల లైన్‌మెన్ మాగాపు శ్రీను బలవంతంగా తీసుకెళ్లి వర్షం వస్తున్నప్పటికీ విద్యుత్ స్తంభం ఎక్కించివెళ్లడంతో విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందారు. అయితే ఘటన జరిగిన రోజు ఐ పోలవరం ఏఈ 33 కెవి లైన్‌పై ఎల్సి తీసుకోవడం జరిగిందని 11 కెవి సరఫరా ఆటోమేటిక్‌గా నిలిచిపోతుందన్నారు. ఆ సమయంలో కొమరగిరి 11 కెవి లైన్ కటింగ్లో ఉండగా, కొత్తలంక ఫీడర్ నుండి అన్నంపల్లి టోల్గేట్‌కు సరఫరా ఇచ్చిన లైన్మెన్ శ్రీను టోల్గేట్ వద్ద విద్యుత్ స్తంభం పై రిపేరు ఎందుకు చేయించాడని డిపార్ట్మెంట్లో లైన్మెన్లు, లైన్ ఇన్స్పెక్టర్లు మల్లగుల్లాలు పడ్డారు. ఈ ఘటనలో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలనే పశువుల్లంక పంచాయతీ అంబటివారిపేట గ్రామస్తులు కుటుంబ సభ్యులు డిమాండ్ చేయడం జరిగింది. మృతుని కుటుంబానికి ఆర్థిక సహకారం అందించాలని విద్యుత్ అధికారులు స్థానిక రాజకీయ నాయకులు కలిసి రూ.18 లక్షలు ఇవ్వాలని ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. విద్యుత్ షాక్‌తో మరణించిన సాయికి లైన్మెన్ మాగాపు శ్రీను పోస్టల్ ఇన్సూరెన్స్ రూ. 755లతో ఇన్సూరెన్స్ చేయించినట్లు చెప్పుకున్నారు. ఇటీవల పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులు ఇన్సూరెన్స్ రూ.15 లక్షల చెక్కును ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎంఎల్ఏ దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా మృతుడు మోర్త సాయి భార్యకు అందజేశారు. అయితే అప్పట్లో మృతుని కుటుంబానికి విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అధికారులు రూ.18 లక్షలు అందజేయడం జరిగింది. ప్రస్తుతం మంజూరైన ఇన్సూరెన్స్ సొమ్మును లైన్మెన్ మాగాపు శ్రీను బాధిత కుటుంబ సభ్యులు నుండి కొంతమంది స్థానిక పెద్దలతో కలిసి తీసుకున్నాడని విశ్వసనీయంగా తెలిసింది. అసలు పోస్టల్ డిపార్ట్మెంట్లో ఎంతో కష్టపడి సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని ఇన్సూరెన్స్ రప్పించడం జరిగిందని లైన్మెన్ మాగాపు శ్రీను చెప్పుకుంటున్నాడని ఆరోపణలు. అసలు పోస్టల్ డిపార్ట్మెంట్లో ఇన్సూరెన్స్ చేయించిన లైన్మెన్ శ్రీను ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయడం కోసం తనకు సంబంధం లేని చోట పనికి తీసుకువెళ్లి చంపేశాడా అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లైన్మెన్ నిర్లక్ష్యంతో సాయి మరణించాడని ఆ ఘటనకు సంబంధించి అప్పట్లో పెద్దలు ఆ సొమ్మును మృతుని కుటుంబానికి తక్షణం అందజేసినట్లు తెలిసింది. జరిగిన ఘటనలో మృతుడుకి ఇన్సూరెన్స్ వస్తుంది కాబట్టి వారి కుటుంబానికి పిల్లల చదువులకు పనికి వస్తుందని కొంతవరకు న్యాయం జరుగుతుందని అప్పట్లో అనుకున్నారు. విద్యుత్ ప్రమాదానికి కారణమైన లైన్మెన్ మాగాపు శ్రీను ఆ శాఖ అధికారులను తన చెప్పు చేతల్లో పెట్టుకుని అధికార పార్టీ అండతో ఆ సొమ్ము పైస్థాయి అధికారులను ప్రసన్నం చేసుకోవడంతోపాటు సస్పెండ్ అయిన లైన్మెన్ ఉద్యోగాన్ని తిరిగి అదే మండలంలో ఆర్డర్ వేయించుకున్నట్లు బాహాటంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలక్ట్రికల్ డిఈఈ మోకా రవికుమార్ పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వడం వెనక ఒక ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలు అడ్డం పెట్టుకుని సస్పెండ్ చేసిన నెలరోజులకు రూ.10లక్షలు తీసుకుని పోస్టింగ్ ఇచ్చేసి డివిజన్ నుండి బదిలీ చేయించుకుని పక్క జిల్లాకు వెళ్లిపోయాడని పలువురు ఆరోపిస్తున్నారు. డబ్బులు విషయంలో మగపు శ్రీను మేలు చేసిన ప్రజా ప్రతినిధిని తప్పుదారి పట్టించే బాధితులకు ఇచ్చిన సాయాన్ని కాజేసాడని అనేక మంది ముక్కున వేలేసుకుంటున్నారు. బాధిత కుటుంబాన్ని విద్యుత్ శాఖ అధికారులు అందించిన సహకారమే తప్ప, మృతుడు సాయికి మంజూరైన ఇన్సూరెన్స్ సొమ్ము లైన్మెన్ శ్రీను తీసేసుకోవడం పట్ల విద్యుత్ శాఖ అధికారులు లైన్మెన్ చేతిలో కీలుబొమ్మలా మారారని, స్థానిక రాజకీయ నాయకులు అండతో విద్యుత్ శాఖ అధికారులు లైన్మెన్ బెదిరింపులకు పాల్పడడంతో ఉద్యోగాలు చేయలేమని ట్రాన్స్ఫర్లు కూడా పెట్టుకుంటున్నారని ఆ శాఖలో పలువురు ఉద్యోగులు మదన పడుతున్నారు. అన్నంపల్లి టోల్గేట్ వద్ద జరిగిన విద్యుత్ శాఖ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించి నిజాలు నిగ్గు తేలసవలిసిన ఆవశ్యకత ఉన్నత అధికారులపై ఎంతైనా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.